'కాంగ్రెస్ హఠావో.. విద్యార్థి బచావో'

కాచిగూడ: విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వానికి జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో తగిన గుణపాఠం తప్పదని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ హెచ్చరించారు. శుక్రవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కాంగ్రెస్ హఠావో – విద్యార్థి బచావో'నినాదంతో ఎన్నికల్లో ప్రచారం నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల ఫీజు బకాయిలు, హాస్టల్స్ మెస్ చార్జీలను చెల్లించకుండా విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తోందన్నారు. జూబ్లీహిల్స్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు, వారి కుటుంబ సభ్యులు ఓటుతో సమాధానం చెప్పాలన్నారు.

ములాయం సింగ్‌కు నివాళి

కాచిగూడ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అడ్డుకుంటున్న పాలక, ప్రతిపక్ష పార్టీల నేతలకు రాజకీయ భవిష్యత్ దగ్గర పడిందని సమాజ్‌వాది పార్టీ తెలంగాణ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.సింహాద్రి యాదవ్ హెచ్చరించారు. సమాజ్‌వాది పార్టీ వ్యవస్థాపకులు ములాయం సింగ్ యాదవ్ వర్ధంతిని శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నేతలు శ్రీహరి ముదిరాజ్, మహ్మద్ వాజిద్ సిద్దికి, మహ్మద్ రిజ్వాన్ హుస్సేన్, రవి కుమార్ బగేల్, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి సదా స్మరణీయులు

చిక్కడపల్లి: రామాయణ మహా కావ్యాన్ని మానవ జాతికి అందించిన వాల్మీకి సదా స్మరణీయులని తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య గౌరీశంకర్ అన్నారు. శుక్రవారం త్యాగరాయ గానసభ జరిగిన వాల్మీకి జయంతిలో ఆయన పాల్గొని మాట్లాడారు. వాల్మీకి బోయవానిగా పక్షులను వేటాడి జీవించే స్థితి నుంచి జాతికి మార్గదర్శనం చేసే మహా ఇతిహాస సృష్టికర్తగా ఎదిగారన్నారు. తరాలు గడిచినా యుగాలు మారినా ఆయన నిలిచిపోతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళా జనార్దనామూర్తి, గోపి వాల్మీకి, బొగ్గు వెంకటేష్, రచయిత మిద్దె సురేష్ పాల్గొన్నారు.

గత కాల ప్రతిభావంతులను విస్మరించొద్దు

చిక్కడపల్లి: గతకాలం ప్రతిభావంతులను విస్మరించొద్దని సినీ సంగీత దర్శకుడు సాలూరి వాసురావు అన్నారు. శుక్రవారం మైహోమ్ అవతార్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (కల్చరల్ వింగ్) ఆధ్వర్యంలో ఇటీవల ఉత్తమ గీత రచయితగా జాతీయ అవార్డు అందుకున్న కాసర్ల శ్యామ్, సినీనటుడు హేమ సుందర్‌కు సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాసురావు ముఖ్యఅతిథిగా వారిని సత్కరించారు.

సాలూరి రాజేశ్వరరావు సంగీతం నవరసభరితం

చిక్కడపల్లి: కవి రాసిన పాటకు అనువైన సంగీత స్వరాలు కూర్చిన సాలూరి రాజేశ్వరరావు సంగీతం నవరసభరితం అని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. శుక్రవారం త్యాగరాయ గానసభలో సినీ సంగీత దర్శకుడు సాలూరి రాజేశ్వర్‌రావు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రముఖులు నివాళులర్పించారు. అనంతరం ప్రముఖ గాయకుడు ఎర్రగొల్ల శ్రీనివాస్ యాదవ్‌కు సాలూరి ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేశారు.

సామాజిక సేవలోనే సంతృప్తి

కాచిగూడ: సామాజిక సేవలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని ఆర్యవైశ్య సంఘం ఇసామియాబజార్ అధ్యక్షుడు కల్వకుంట్ల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శుక్రవారం కాచిగూడలోని కార్యాలయంలో చేయూత కార్యక్రమంలో భాగంగా నిరుపేద మహిళలకు నగదు, నిత్యావసరాలను ఆయన పంపిణీ చేశారు.

కుల వివక్ష వల్లే దళిత ఐపీఎస్ మృతి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హరియాణా రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దళిత ఐపీఎస్ అధికారి పోరన్ కుమార్ కుల వివక్ష అవమానం తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవడం అత్యంత విచారకరమని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఐపీఎస్ స్థాయిలో ఉన్న దళితుడికి అవమానం జరిగితే సామాన్య దళితుడి పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. ఐపీఎస్ అధికారి కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలబడాలని కోరారు.

వ్యక్తి అదృశ్యం

కాచిగూడ: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బర్కత్‌పుర ప్రాంతానికి చెందిన కిషోర్‌కుమార్ (64) ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. వివిధ ప్రాంతాల్లో ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం అతడి కుమారుడు ధ్రువ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



శ్రీరాంనగర్ బస్తీలో మోకాలి లోతు వరకు చేరిన వరద నీరు (ఫైల్)



ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ నాలాను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ (ఫైల్)



ఇళ్లలోకి చేరిన వరదనీరు(ఫైల్)

ముందుచూపు లేకనే ముప్పు.!

- భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు మునక
- సీరియస్‌గా తీసుకోని అధికారులు, పాలకులు
- ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాంనగర్ డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్ బస్తీ, నాగమయ్య కుంట, పద్మాకాలనీ తదితర ప్రాంతాలు చిన్నపాటి వర్షానికి వరద పోటెత్తి నాలాలు పొంగిపొర్లడం పరిపాటిగా మారింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ ముంపునకు గురై తీవ్ర నష్టం వాటిల్లుతోంది. పెరిగిన జనాభాకు అనుగుణంగా నాలాల ఆధునీకరణ చేపట్టకపోవడం.. పలు ప్రాంతాల్లో ఆక్రమణలు చోటు చేసుకోవడంతో సమస్య తీవ్రతరం అవుతోందని స్థానికులు చెబుతున్నారు.

◆ ఇటీవల హైడ్రా కమిషనర్ రంగనాథ్ ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నాలాలను పరిశీలించారు. ఆక్రమణలతోనే వరద ముంచెత్తుతోందని స్థానికులు ఆయనకు తెలిపారు. ఏళ్లుగా సమస్య ఉత్పన్నమవుతున్నా అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేపడుతున్నారే తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని తెలిపారు.

◆ వర్షాలకు శ్రీరాంనగర్, కమాన్ బస్తీ మునిగిపోయింది. నడుముల లోతు నీళ్లు రావడంతో ఇళ్లలోని నిత్యావసరాలు, సామగ్రి అంతా తడిసిపోయింది. ఆ సమయంలో ముంపు బాధితులు పడిన బాధలు వర్ణనాతీతం. నాలా పరీవాహక ప్రాంతాల ప్రజలు వర్షం కురిస్తే వణికిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. పాలకులు, అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వలనే ఈ పరిస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాలా విస్తరణ చేపట్టాలి..



ఆక్రమణకు గురైన ప్రాంతాల్లో నాలా విస్తరణ పనులు చేపట్టాలి. ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేపట్టాలి. నాలా ప్రహరీని పటిష్టంగా నిర్మించాలి. అప్పుడే కొంత వరకు ముంపు బారిన పడకుండా ఉంటాం.

– కె.ఉపేందర్, స్థానికుడు

అధికారుల నిర్లక్ష్యం వల్లే..



అధికారులు నిర్లక్ష్యం వల్లే లోతట్టు ప్రాంతాలు మునుగుతున్నాయి. మునకకు గురైనప్పుడు తాత్కాలిక చర్యలు చేపడుతున్నారు. శాశ్వత పరిష్కారం చూపడం లేదు. అధికారులు, పాలకులు స్పందిచాలి.

– ఖాదర్, స్థానికుడు

నేరాలు లేని తెలంగాణ సాధించుకోవడమే లక్ష్యం

- సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి
- దోమలగూడ పీఎస్‌లో వార్షిక తనిఖీలు

కవాడిగూడ: నేరాల అదుపునకు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలతో మంచి సంబంధాలు కొనసాగిస్తూ ముందుకు సాగినప్పుడే శాంతి భద్రతల పరిరక్షణ సాధ్యం అవుతుందని సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి అన్నారు. దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆమె వార్షిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 5 గంటల పాటు కేసుల వివరాలు, ఎఫ్ఐఆర్ నమోదు, పెండింగ్ కేసుల ఫైళ్లను పరిశీలించారు. మూడేళ్లకు సంబంధించిన అన్ని రకాల ఫైళ్లపై ఆరా తీశారు. పోలీస్ స్టేషన్‌లో నేరాల అదుపునకు తీసుకుంటున్న చర్యలు, రౌడీషీటర్లు, పాతనేరస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కోర్టు కేసులు ఏమైనా పెండిగ్‌లో ఉన్నాయా.. కేసు నమోదు చేసిన వారికి ఎలాంటి శిక్షలు పడ్డాయి అనే కోణంలో కూడా ఆమె ఆరాతీశారు. అదే విధంగా ఠాణా పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదు చేయడానికి వచ్చే బాధితులకు అందిస్తున్న సహకారం కూడా ఆమె అడిగి తెలుసుకున్నారు. నేరాలు లేని తెలంగాణ సాధించుకోవడమే పోలీస్ వ్యవస్థ లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. నేరాలను అదుపు చేయడానికి, తగ్గించడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ అడిషనల్ డీసీపీ ఆనంద్ కుమార్, గాంధీనగర్ సబ్‌డివిజన్ ఏసీపీ యాదగిరి, ఇన్‌స్పెక్టర్ ఎండీ అంజద్‌అలీ, డీఐ సురేందర్‌రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు తెలుసుకుంటున్న సెంట్రల్ జోన్ డీసీపీ శిల్పవల్లి

తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తాం

దోమలగూడ వాటర్‌వర్క్స్ మేనేజర్ సుప్రజ

కవాడిగూడ: వారం రోజులుగా మైసమ్మ బండ బస్తీలో తాగునీటి సరఫరా లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్తీవాసుల ఫిర్యాదు మేరకు శుక్రవారం దోమలగూడ వాటర్‌వర్క్స్ మేనేజర్ సుప్రజ సిబ్బందితో కలిసి బస్తీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పైప్‌లైన్ మరమ్మతుల వల్ల నీటి సమస్యకు అంతరాయం ఏర్పడిందన్నారు. సాయంత్రలోపు మరమ్మతులు చేసి యథావిధిగా నీటి సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. సందర్భంగా స్థానికులు గత వారం రోజులుగా తమ బస్తీలో నీటి సరఫరా లేక తాగునీటి కోసం ఇబ్బందులకు పడుతున్నామని, మరోవైపు డ్రైనేజీ సమస్యలతో కూడా ఇబ్బందులు పడుతున్నామని వారికి వివరించారు. మైసమ్మ బండలో నెలకొన్న నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని బీజేపీ నాయకులు వెంకటేష్, సలంద్రి శ్రీనివాస్‌యాదవ్ ఆమెను కోరారు. ఈ కార్యక్రమంలో కుమార్‌గౌడ్, గిరిధర్, నర్సింగ్, స్థానికులు పాల్గొన్నారు.



మైసమ్మ బండలో నీటి సమస్యను తెలుసుకుంటున్న వాటర్‌వర్క్స్ మేనేజర్ సుప్రజ

బహుజనులు రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి

బీఎల్పీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుపై హైకోర్టు స్టే ఇవ్వడం అత్యంత బాధాకరమని బహుజన లెఫ్ట్ పార్టీ (బీఎల్పీ) రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని తన కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇలాంటి స్టేలు ఇవ్వడం వల్ల బీసీ ప్రజల్లో అసంతృప్తి, అసహనం పెరుగుతుందని అన్నారు. అగ్రకులాలకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఇచ్చినప్పుడే 60 శాతానికి రిజర్వేషన్లు చేరాయని గుర్తు చేశారు. మండల కమిషన్ ఉద్యమం నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కోర్టులు బీసీ కులాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కులాలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి జీఓ నం.9ని తీసుకొస్తే దానిని అడ్డుకునేందుకు కుట్రలు చేశారని విమర్శించారు. బహుజనులంతా ఏకమై రాజ్యాధికారం కోసం ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు.

విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండాలి



అంబేడ్కర్ కళాశాలలో మానసిక ఆరోగ్యంపై జరిగిన సదస్సులో డాక్టర్ శివకుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉంటేనే అనుకున్నది సాధిస్తారని క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ శివకుమార్ గుండెటి అన్నారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళాశాలలో 'విద్యార్థుల మానసిక ఆరోగ్యం'అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డా. శివకుమార్ గుండెటి మాట్లాడుతూ... విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఆటపాటల్లో కూడా చురుకుదనాన్ని కనబరచాలన్నారు. ఇతరులతో పోల్చుకుని మానసిక ఒత్తిడికి గురికాకుండా ఆహ్లాదంగా ఉత్సాహభరితంగా విద్యను కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ డా. విష్ణుప్రియ, కళాశాల ప్రిన్సిపల్ డా. మట్టా శేఖర్ తదితరుల పాల్గొన్నారు.

ప్రధాన ఆరోగ్య సవాళ్లలో గుండె జబ్బు ఒకటి

డా. పంకజ్ జరివాలా



చిక్కడపల్లి: తెలంగాణలో ప్రధాన ఆరోగ్య సవాళ్లలో ఒకటిగా గుండె జబ్బు నిలుస్తోందని ప్రముఖ హృద్రోగ వైద్యనిపుణులు డా. పంకజ్ జరివాలా అన్నారు. చిక్కడపల్లిలో 'గుండె సంరక్షణకు కొత్త విధానం.. మెటల్‌స్టంట్‌లు లేకుండా మూసుకుపోయిన ధమనులకు చికిత్స'అనే అంశంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చిన్న వయస్సులోనే ఎక్కువ మంది గుండె జబ్బుల బారిన పడుతున్నారని అన్నారు. ధమనులలో అవరోధాలు ఏర్పడే వారికి సకాలంలో రోగ నిర్ధారణ 'డ్రగ్ కోటెడ్ బెలూన్'వంటి కొత్త చికిత్స విధానం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ చికిత్సతో దీర్ఘకాలంలో గుండె ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవడంలో సహాయ పడుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రోజులో కొంత సమయం యోగా, వ్యాయామానికి కేటాయించాలన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ముషీరాబాద్: దసరా మిలాప్ కార్యక్రమాన్ని ఈనెల 12న నిర్వహించనున్న విషయం తెలిసిందే. శుక్రవారం ఎస్ఆర్‌టీ కమ్యూనిటీహాల్‌లో దసరా మిలాప్ పోస్టర్‌ను తెలంగాణ రాష్ట్ర దళిత ఐక్య వేదిక ప్రతినిధులు ఆవిష్కరించారు. వేదిక మీడియా కన్వీనర్ గజ్జల సూర్యనారాయణ మాట్లాడుతూ... ఈనెల 12న ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే దసరా మిలాప్‌కు దళితులందరూ హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కేశపురం స్వామి, గండి కృష్ణ, ఆరు, వివేక్, చిట్టి, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు వస్తాయి

బండారు దత్తాత్రేయ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థులకు ఏకాగ్రత ఎంతో అవసరమని ఏకాగ్రతతో చదివితే మంచి ఫలితాలు వస్తాయని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. శుక్రవారం చిక్కడపల్లిలోని ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొమురం భీం స్టడీ సర్కిల్ విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇష్టంతో చదివితే ఏది కష్టం కాదని అన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు సమయాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు.

జూబ్లీహిల్స్‌లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మెదక్ ఎంపీ రఘునందన్ రావు



కాచిగూడ: జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు. శుక్రవారం బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయంలో అంబర్‌పేట నియోజకవర్గం కోర్‌కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రస్తుత కాంగ్రెస్ అభ్యర్థి ఎంఐఎం పార్టీ నుంచి పోటీ చేశారన్నారు. ఇప్పుడు అదే అభ్యర్థి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయడం చూస్తుంటే ఆ రెండు పార్టీలు కుమ్మక్కు అయినట్లు కనిపిస్తోందన్నారు. దీనిని జూబ్లీహిల్స్ ప్రజలు గమనించి బీజేపీ అభ్యర్థికి ఓటు వేయాలన్నారు. గత రెండు పర్యాయాలు జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఉన్నా ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే దానిని మూసీనదిలో వేసినట్లేనని అన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎడెల్లి అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్.గౌతంరావు, ఆనంద్‌గౌడ్, లంకల దీపక్‌రెడ్డి, రమేష్ యాదవ్, శ్యామ్‌రాజ్, సి.నందకిషోర్ యాదవ్, ఎ.సూర్యప్రకాష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ విజయం తథ్యం

అంబర్‌పేట: జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యమని మాజీ రాజ్యసభ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు అన్నారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ శుక్రవారం వి.హనుమంతరావును కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ... నవీన్‌యాదవ్ మంచి పేరున్న నాయకుడని అన్నారు. గతంలో ఎంఐఎం నుంచి పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారని అన్నారు. ఈసారి జూబ్లీహిల్స్ ప్రజలు గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్.లక్ష్మణ్ యాదవ్, నారాయణ స్వామి, దిడ్డి రాంబాబు, పులి జగన్, తొలుపునూరి కృష్ణ గౌడ్, గడ్డం శ్రీధర్, రాంమోహన్, జహంగీర్, జమీర్, ఈశ్వర్, శశిగౌడ్, రోహిన్, తదితరులు పాల్గొన్నారు.



వి.హనుమంతరావును కలిసి ఆశీస్సులు తీసుకుంటున్న నవీన్ యాదవ్

గ్రంథాలయ ఆలయంలో నవీన్‌యాదవ్ పూజలు



చిక్కడపల్లి: జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ శుక్రవారం చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించారు. నగర గ్రంథాలయ చైర్మన్ కె.ఉపేందర్‌రెడ్డి, నిరుద్యోగ అభ్యర్థులతో కలసి నగర గ్రంథాలయంలో ఆవరణలోని రేణుకాఎల్లమ్మకు పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... అమ్మవారి దయ ఉంటే విజయం సాధిస్తానన్నారు. ఈ సందర్భంగా నిరుద్యోగులతో కాసేపు మాట్లాడి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నేతలు శంకర్‌నాయక్, కయ్య వెంకటేష్, సలీమ్, అనిల్, నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'అడవి బాపిరాజు'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దాశరథి థియేటర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కిన్నెర చిత్ర (అడవి బాపిరాజు) లఘుచిత్ర ప్రదర్శన ఆకట్టుకునేలా సాగింది. ఈ చిత్రానికి నిర్మాత మద్దాలి రఘురాం, రచన దర్శకత్వం పివి చలంలు కాగా కెమెరామెన్ వెంకట్‌రావు, నటీనటులు సుబ్బారావు, లక్కీ, మధులిక తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో ఎస్వీకే కార్యదర్శి ఎస్. వినయ్‌కుమార్ మాట్లాడుతూ... ప్రజలను చైతన్య పరిచే ఇలాంటి సందేశాత్మకమైన చిత్రాలు రావాలని అభిలాషించారు. సభానంతరం చిత్ర నిర్మాత దర్శకులను ఘనంగా సత్కరించారు.

డ్రామాలు ఆపండి.. పార్లమెంట్‌లో చట్టం చేయించండి



కాచిగూడలో నిరసన ప్రదర్శనలో జాతీయ బీసీ మహాసభ నేతలు

కాచిగూడ: అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు గ్యారంటీల పేరిట మోసగించిన తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్ల పేరిట డ్రామా ఆడుతోందని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ విమర్శించారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడాన్ని నిరసిస్తూ బీసీ మహాసభ ఆధ్వర్యంలో నింబోలిఅడ్డలో బీసీలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 55 ఏళ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏనాడైనా బీసీ రిజర్వేషన్ల కోసం పాటుపడిందా అని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల పెంపుపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీ వేదికగా జాతీయ స్థాయిలో ఉద్యమించాలన్నారు. విషయంలో కలిసి వచ్చేందుకు జాతీయ బీసీ మహాసభతో పాటు బీసీ సంఘాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి డ్రామాలు ఆపి పార్లమెంట్‌లో చట్టం చేయించి రిజర్వేషన్ల పెంపును రాజ్యాంగంలోని షెడ్యూల్-9లో చేర్పించాలని డిమాండ్ చేశారు. జీఓ నం.9 జారీలో ప్రభుత్వం శాస్త్రీయంగా వ్యవహరించనందునే హైకోర్టు స్టే ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ మహాసభ నేతలు డాక్టర్ ప్రశాంత్ నిమ్‌కర్, భూషణ్ భాస్కర్, కిషోర్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

'ఆజామాబాద్‌లో కంపెనీ భూములు వాడేసుకుంటున్నారు'

ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి



ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియాలో మార్వాడీ గో బ్యాక్ నినాదాలు చేస్తున్న డాక్టర్ పిడమర్తి రవి

కవాడిగూడ: ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి డిమాండ్ చేశాడు. శుక్రవారం ఆయన ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయని ఆశించి ప్రభుత్వం కంపెనీలు పెట్టిన మార్వాడీలకు భూములను ఇచ్చిందన్నారు. ఇప్పుడు వాళ్లు ఆ కంపెనీలను మూసేసి యువతకు ఉపాధి లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం రూ.వేల కోట్ల విలువ చేసే ఆజామాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా భూములను లీజుకిస్తూ మార్వాడీలు అక్రమంగా డబ్బులను సంపాదిస్తున్నారని అన్నారు. ఈ భూములను ఇతర అవసరాలకు వినియోగించుకుంటే లీజును రద్దు చేసే హక్కు ప్రభుత్వానికి ఉందని తెలిపారు. కంపెనీలను మూసేసి ఇతర కార్యకలాపాలకు వాడుకుంటున్న ఆ భూములను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్మరంలో మార్వాడీ గో బ్యాక్ జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ బోరెల్లి సురేష్, ఓయూ అధ్యక్షుడు ఎండీ రహీం, రాష్ట్ర నాయకులు నారాయణ, అందే కృష్ణ, మాడుగుల శివ, చాగంటి శేఖర్, రింగు రాంబాబు, రమేష్ గౌడ్, మీసాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీ రిజర్వేషన్లను రాజకీయ క్రీడగా మార్చారు'

కవాడిగూడ: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు బీసీ రిజర్వేషన్లను రాజకీయ క్రీడగా మార్చారని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డా. దిడ్డి సుధాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల అముల జీఓ నం.9 పై రాష్ట్ర హైకోర్టు స్టే విధించడం పై ఆయన విచారం వ్యక్తం చేశారు. హైదరాబాద్, లిబర్టీ, ఆప్ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడారు. గత 78 ఏళ్లుగా దేశంలోని ఓబీసీలను ప్రభుత్వాలు మోసం చేస్తూనే వస్తున్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు చేయడానికి రాష్ట్ర అసెంబ్లీ పంపిన ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఎందుకు ఆమోదించడంలేదని అన్నారు. రాష్ట్ర బీజేపీ నేతల ఒత్తిడితోనే గవర్నర్ ఆమోదించడం లేదని స్పష్టంగా కనిపిస్తుందన్నారు.

◆ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు రాష్ట్ర హైకోర్టు స్టే విధిస్తే సుప్రీం కోర్టుకు వెళ్లమని ప్రభుత్వానికి ఉచిత సలహా ఇస్తున్నారే తప్ప ఏమీ చేయడం లేదని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు హైకోర్టు కేసులో ఇంప్లీడ్ కాలేదని పేర్కొన్నారు. బీసీలు రాజకీయంగా ఎదుగుతే వారు సహించలేరని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల బంతి బీజేపీ చేతుల్లోనే ఉందన్నారు. వారు ఆర్డినెన్సును గవర్నర్‌తో ఆమోదించే సత్తా ఉందని తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి 9వ షెడ్యూల్‌లో రిజర్వేషన్ల పెంపును చేర్పించవచ్చని పేర్కొన్నారు. కానీ రాష్ట్ర బీజేపీ నేతలు అలా చేయరని విమర్శించారు.

◆ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అఖిల పక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లి రాష్ట్రపతి, ప్రధానిపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. అవసరమైతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సహా అన్ని రాజకీయ పార్టీల నేతలు నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభించాలని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలయ్యే వరకు ఆప్ పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆప్ రాష్ట్ర నాయకులు బుర్ర రాముగౌడ్, విజయ్ మల్లంగి, అబ్దుల్ ముక్తాదిర్, ఎండీ మాజీద్, దర్శనం రమేష్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డా.దిడ్డి సుధాకర్ తదితరులు